kalamdaily.com

# కలం

ప్రజల గళం...

Follow on: Kalamtelugu

శనివారం ● 18-04-2026

పేజీలు: 5

360° SINGLE TOPIC

కోటా - పొలిటికల్ ఆట


# మహిళా బిల్లు..


# బ్లేమ్ గేమ్

## ఎన్డీఏ వర్సెస్ ఇండియా కూటమి

## దశాబ్దాల కలకు అడుగడుగునా ఆటంకాలు

- వీగిపోయిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు
- కావాలనే ప్రతిపక్షాలు అడ్డుకున్నాయి: బీజేపీ
- ఇష్టారీతి డీలిమిటేషన్ కోసం కుట్రలు: కాంగ్రెస్
- ఇప్పుడున్న సీట్లలో కోటా ఇస్తే సపోర్ట్ చేస్తామని ప్రకటన
- డీలిమిటేషన్ తర్వాతే ఇస్తామన్న అధికారపక్షం
- 2029 ఎన్నికల్లో 33% రిజర్వేషన్లు కష్టమే!

మహిళా రిజర్వేషన్ చట్ట సవరణ బిల్లుపై ఎన్డీఏ, ఇండియా కూటముల మధ్య బ్లేమ్ గేమ్ స్టార్ట్ అయింది. మహిళల రిజర్వేషన్లను విపక్షాలు అడ్డుకున్నాయంటూ బీజేపీ సహా ఎన్డీఏ భాగస్వామ్య పార్టీలు ఆరోపిస్తున్నాయి. ప్రతిపక్షాలది మహిళా వ్యతిరేక స్వభావం అంటూ రాష్ట్రాల్లో నిరసన ర్యాలీలు చేస్తున్నాయి. మరోవైపు కాంగ్రెస్ నేతృత్వంలోని 'ఇండియా' టీమ్ పార్టీలన్నీ "కేంద్ర ప్రభుత్వం పెట్టింది మహిళా రిజర్వేషన్ బిల్లు కానే కాదు.. దాని ముసుగులో ఉన్న డీలిమిటేషన్ బిల్లు.. అందుకు అనుగుణంగా రాజ్యాంగ సవరణ బిల్లు తీసుకొచ్చింది.. మేం ఓడించింది మహిళా రిజర్వేషన్ బిల్లును కాదు.. డీలిమిటేషన్ కుట్రను. దేశానికి జరిగే పెను ప్రమాదాన్ని నివారించాం.." అని వ్యాఖ్యానించాయి.





మహిళా కోటాకు ఎప్పటిలానే అడుగడుగునా ఆటంకాలు. పాలకులకు చిత్తశుద్ధి కరువు.. ప్రతిపక్షాలదీ అదే తంతు!! ఈ నెల 23న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు, పశ్చిమబెంగాల్ ఫస్ట్ ఫేజ్ అసెంబ్లీ ఎలక్షన్స్‌లో మహిళా రిజర్వేషన్ అంశాన్ని బీజేపీ, ఎన్డీఏ పార్టీలు వాడుకోవాలని చూస్తున్నాయి. దీనికి దీటుగా డీలిమిటేషన్ అంశాన్ని ప్రస్తావిస్తూ కాంగ్రెస్, డీఎంకే, తృణమూల్ కాంగ్రెస్ పార్టీలు బీజేపీ తీరును ఎండగడుతున్నాయి. నిజాయితీ ఉంటే మహిళా రిజర్వేషన్ బిల్లును విడిగా పెడితే ఇప్పటికిప్పుడు ఎలాంటి అభ్యంతరాలు లేవనెత్తకుండా, సవరణలకు పట్టుబట్టకుండా ఉన్నదున్నట్లుగా ఆమోదిస్తామని హామీ ఇస్తూనే బీజేపీ తీరును దుయ్యబడుతున్నాయి.

ముప్పై ఏండ్ల మహిళా రిజర్వేషన్ అంశానికి 2023లోనే చట్టబద్ధత లభించింది. ఐదారు ప్రయత్నాల తర్వాత సక్సెస్ సాకారమైంది. కాంగ్రెస్ సహా విపక్ష పార్టీలన్నీ నాడు సంపూర్ణంగా మద్దతు పలికాయి. దీంతో 2034 లోక్‌సభ ఎన్నికల నుంచి చట్టసభల్లో 33% రిజర్వేషన్ అమలులోకి రావాల్సి ఉంది. చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యంలో ప్రపంచంలోని అనేక దేశాలతో పోలిస్తే భారత్ అట్టడుగున 154వ స్థానంలో ఉన్నది. పొరుగున ఉన్న పాకిస్థాన్‌లో సైతం భారత్‌కంటే మెరుగైన తీరులో మహిళల ప్రాతినిధ్యం ఉన్నది. మహిళలకు ప్రాధాన్యంపై గొంతు చించుకుంటున్న బీజేపీ, కాంగ్రెస్ సహా అనేక రాజకీయ పార్టీలు చట్టంతో సంబంధం లేకుండా 2029 ఎన్నికల్లో ఎంత మంది మహిళలకు టికెట్లు ఇస్తాయన్నది ప్రశ్నార్థకం.

ఇంతకూ విపక్షాలు ఓడించింది మహిళా రిజర్వేషన్ బిల్లునా?.. లేక డీలిమిటేషన్ చేయాలన్న రాజ్యాంగ సవరణ బిల్లునా?.. మహిళా బిల్లునే ఆమోదం పొందకుండా చేశాయన్నది బీజేపీ వాదన. మహిళా కార్యకర్తలను విపక్ష నేతల ఇండ్ల ముందు ధర్నాలకు దింపింది. మరోవైపు కాంగ్రెస్ సహా విపక్షాలు మాత్రం తాము వ్యతిరేకించింది మహిళా బిల్లును కాదని, డీలిమిటేషన్ బిల్లునే అని తేల్చిచెప్తున్నాయి. నిజానికి ఓటింగ్ జరిగింది కూడా మహిళా రిజర్వేషన్ బిల్లు మీద కాదు.. రాజ్యాంగ సవరణ బిల్లు మీదనే! విపక్షాలను విమర్శించేందుకు మహిళా బిల్లును బీజేపీ అస్త్రంగా వాడుకుంటున్నది. దాన్ని తిప్పికొట్టేందుకు 'ఇండియా' టీమ్ కూడా తన వంతు ప్రయత్నాలు చేస్తున్నది.

ఎన్డీఏ ఉచ్చులో 'ఇండియా' కూటమి చిక్కుకున్నదా? లేక ఇండియా కూటమి ప్లాన్‌తో ఎన్డీఏ బొక్క బోర్లా పడిందా? రాజ్యాంగ సవరణ బిల్లును అడ్డుకోవడం ప్రతిపక్షాలకు ప్లస్ అయిందా? లేక అధికారపక్షానికి కలిసొచ్చిందా? బీజేపీ బిల్లుల హంగామా మహిళలకు రాజకీయ అశకాశాలు కల్పించడానికా? లేక పొలిటికల్ డ్రామానా? తమిళనాడు, పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికలయ్యేంత వరకు ఓ పది రోజుల పాటు పొలిటికల్ బ్లేమ్ గేమ్ కంటిన్యూ కానున్నదా? వీటిపై కలం 360 డిగ్రీస్ ప్రత్యేక కథనం...

-తెలంగాణ బ్యూరో, కలం

## బిల్లు వీగింది ఇలా..

చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లు, డీలిమిటేషన్ బిల్లు, ఇందుకోసం అవసరమైన 131వ రాజ్యాంగ సవరణ బిల్లుకు లోక్‌సభలో జరిగిన ఓటింగ్‌లో మూడింట రెండొంతుల మెజారిటీ రాకపోవడంతో వీగిపోయాయి. దీంతో మహిళా రిజర్వేషన్ అమలుకు బ్రేకులు పడ్డాయి. డీలిమిటేషన్ చేపట్టే ప్రక్రియ కూడా ఆగిపోయింది. రాజ్యాంగ సవరణ లేకపోవడంతో ఈ రెండు ప్రక్రియలూ ప్రభుత్వం ఆశించిన స్థాయిలో అమల్లోకి వచ్చే అవకాశం లేకుండా పోయింది. ఓటింగ్ ముగిసేంతవరకూ ఒక రకమైన ఉత్కంఠ నెలకొనగా ఆ తర్వాత పొలిటికల్ బ్లేమ్ గేమ్ మొదలైంది. డీలిమిటేషన్‌తో దేశాన్ని నార్త్, సౌత్ భాగాలుగా విభజించే కుట్రతో మహిళా బిల్లు పేరుతో కేంద్రం ముందుకు వచ్చిందని, దాన్ని అడ్డుకున్నామని, ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ స్పష్టం చేశారు.

## అది మహిళా బిల్లు కాదు: ఇండియా కూటమి

ఇష్టారీతిన డీలిమిటేషన్ ప్రక్రియ చేయాలన్నది కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని, దానికి సాకుగా మహిళా రిజర్వేషన్ బిల్లును ముందుకు తెచ్చిందని, 2023లోనే ఆమోదం పొందిన బిల్లును మళ్లీ తేవడం వెనుక కుట్ర ఉందని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ సహా పలు విపక్షాల నేతలు లోక్‌సభ వేదికగా వ్యాఖ్యానించారు. మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్ కల్పించాలన్న చిత్తశుద్ధి నిజంగా బీజేపీకి ఉన్నట్లయితే డీలిమిటేషన్ బిల్లుతో సంబంధం లేకుండా విడిగానే మహిళా రిజర్వేషన్ బిల్లును పెట్టాలని డిమాండ్ చేశారు. ఇప్పుడున్న 543 స్థానాల్లోనే మహిళలకు 33% సీట్లను కేటాయించడానికి తాము సిద్ధంగా ఉన్నామని, ఆ స్ఫూర్తితోనే బిల్లు పెట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహిళలకు అవకాశాలు లేకుండా చేశాయంటూ విపక్షాలను రాజకీయంగా విమర్శించాలన్న ఉద్దేశంతోనే కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లుల విషయంలో అడుగడుగునా కుట్రలకు పాల్పడిందని ఆరోపించారు. కేంద్రం ప్రవేశపెట్టింది మహిళా బిల్లు కాదని.. దొడ్డిదారిన డీలిమిటేషన్ కోసం చేసిన కుయుక్తులని, వాటిని అడ్డుకున్నామని తెలిపారు.

## ఇతర బిల్లులు వాపస్

డీలిమిటేషన్‌ను, మహిళా రిజర్వేషన్‌ను కలగలిపి తీసుకురావాలన్న నిర్ణయానికి అనుగుణంగా రాజ్యాంగ సవరణ అవసరం కావడంతో ఆ బిల్లును కూడా కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. ఇది ముమ్మాటికీ మహిళా బిల్లు కాదని, రాజ్యాంగాన్ని మార్చే కుట్ర అని, అందుకే రాజ్యాంగ విరుద్ధంగా దొడ్డి దారిన మహిళా బిల్లు పేరుతో నియోజకవర్గాల సంఖ్యను పెంచే డ్రామా ఆడిందని కేంద్ర ప్రభుత్వాన్ని రాహుల్‌గాంధీ విమర్శించారు. రాజ్యాంగ సవరణ బిల్లుకు అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీ లోక్‌సభలో రాకపోవడంతో బిల్లు వీగిపోయింది. దీంతో మిగిలిన రెండు బిల్లులను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకున్నది. తాజా పరిణామాల నేపథ్యంలో కేంద్రం ఎలా ముందుకు వెళ్తుందన్నది ప్రశ్నార్థకం?.



డీలిమిటేషన్ డ్రాఫ్ట్ కాపీని చెన్నైలో తగలబెడుతున్న తమిళనాడు సీఎం స్టాలిన్

## ఒకరిపైకి ఒకరు..!

రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడంతో అధికార ఎన్డీయే కూటమి, ప్రతిపక్ష ఇండియా కూటమి పార్టీల మధ్య బ్లేమ్ గేమ్ జోరందుకుంది. విపక్షాలు అడ్డుపడిన కారణంగానే మహిళా రిజర్వేషన్ బిల్లుకు బ్రేక్ పడిందని ఇప్పటికే ఎన్డీఏ మహిళా ఎంపీలు ఆరోపిస్తున్నారు. కాంగ్రెస్ కారణంగానే మహిళా బిల్లుకు ఆటంకాలు ఏర్పడ్డాయని విమర్శలను బీజేపీ తీవ్రతరం చేస్తున్నది. రాజ్యాంగాన్ని మార్చాలన్న కుట్రకు ముసుగుగా మహిళా రిజర్వేషన్ బిల్లును ముందుకు తీసుకొచ్చిందని కాంగ్రెస్ సహా విపక్షాలు కౌంటర్ ఇస్తున్నాయి. ఈ దేశానికి జరిగే పెను ప్రమాదాన్ని నివారించామని చెప్తున్నాయి. మహిళా రిజర్వేషన్‌లకు తాము వ్యతిరేకం కాదని, ఇప్పటికిప్పుడు డీలిమిటేషన్ బిల్లుతో లింకు పెట్టకుండా విడిగా బిల్లు పెడితే ఇప్పుడున్న 543 స్థానాల్లోనే మహిళలకు 33% సీట్లను రిజర్వు చేయడానికి సంపూర్ణంగా మద్దతు పలుకుతామని బీజేపీకి కౌంటర్ ఇస్తున్నాయి.

ఫేర్ డీలిమిటేషన్ కోసం పార్లమెంట్ ఎదుట ప్రతిపక్షాల ర్యాలీ




## మహిళా వ్యతిరేక పార్టీలు ప్రతిపక్షాలు: ఎన్డీఏ

మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ సహా విపక్షాలు అడ్డుపడ్డాయని ఆరోపిస్తూ ఎన్డీఏ మహిళలు పార్లమెంట్ ఆవరణలో ప్లకార్డులతో నిరసనలకు దిగారు. మహిళల నోటి దగ్గరకు వచ్చిన బువ్వను మట్టిపాలు చేశాయంటూ విపక్ష పార్టీలపై విమర్శలు చేశారు. రాజ్యాంగ విరుద్ధంగా రాహుల్‌గాంధీ కుట్రకు పాల్పడ్డారని ఆరోపించారు. మోదీ ప్రభుత్వం అవకాశాలు ఇవ్వడానికి ప్రయత్నిస్తే ప్రతిపక్షాలు మాత్రం అడ్డుకునే కుట్రలు చేశాయన్నారు. కేవలం ఇండియా కూటమి కారణంగానే మహిళా రిజర్వేషన్ బిల్లు సాకారం కాలేదని దుయ్యబట్టారు. మహిళలపై ఇండియా కూటమి పార్టీలు ఏ రకంగా వ్యతిరేక భావనతో ఉన్నాయో ఈ అంశం అద్దం పడుతున్నదని ఎన్డీఏ మహిళా ఎంపీలు వ్యాఖ్యానించారు. మహిళకు రాజకీయ అవకాశాలు ఇవ్వకుండా అడ్డుకున్న విపక్షాలకు రాబోయే ఎన్నికల్లో మహిళా ఓటర్లే బుద్ధి చెప్తారని వారు హెచ్చరించారు.




మహిళా బిల్లును ప్రతిపక్షాలు అడ్డుకున్నాయంటూ పార్లమెంట్ ముందు ఎన్డీయే సభ్యుల ఆందోళన

# 30 ఏండ్ల పోరాటం..




మహిళా రిజర్వేషన్ బిల్లుకు గ్రహణం పట్టిందా అన్నట్లుగా ముప్పై ఏండ్లుగా పార్లమెంటులో చర్చకు రావడం.. ఆ తర్వాత వీగిపోవడం రొటీన్ ప్రాక్టీసుగా మారింది. దేశ రాజకీయ చరిత్రలోనే సుదీర్ఘకాలం పెండింగ్‌లో ఉన్న బిల్లుల్లో ఒకటిగా మహిళా రిజర్వేషన్ అంశం రికార్డులకెక్కింది. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్ కల్పించాలన్న డిమాండ్ దశాబ్దాలుగా ఉన్నా తొలుత కదలిక వచ్చింది మాత్రం 1996లోనే. ఆ తర్వాత మరో ఐదుసార్లు పార్లమెంటు ఉభయ సభల్లో చర్చకు వచ్చింది. కానీ ఒక్కసారి కూడా సంపూర్ణంగా అమల్లోకి రాలేదు. ఫస్ట్ టైమ్ 2023లో చట్టంగా రూపొందింది.

# అడుగడుగునా ఆటంకం

## ఆరుసార్లు వీగిపోయి..!

మహిళా రిజర్వేషన్ బిల్లు మొత్తం ఆరుసార్లు పార్లమెంటులో వీగిపోయింది. మొట్టమొదట 1996లో పార్లమెంటులోకి మహిళా రిజర్వేషన్ అంశం బిల్లు రూపంలో ఎంటర్ అయింది. 2023లో మొదటిసారి చట్టబద్ధత లభించింది. కానీ అది అమల్లోకి రావాలంటే మాత్రం 2034 వరకూ ఆగాల్సిందే. దాన్ని అప్పటివరకూ ఆపకుండా వెంటనే 2029 ఎన్నికల నుంచే అమల్లోకి తేవాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ సవరణతో డీలిమిటేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని భావించింది. కానీ ఆ బిల్లు వీగిపోవడంతో మహిళా రిజర్వేషన్ 2029 నుంచి అమలు చేయడం సాధ్యం కాదని తేలిపోయింది. ఇప్పటివరకు మహిళా రిజర్వేషన్ బిల్లు పరిణామాలను గమనంలోకి తీసుకుంటే...



### 1996 :

చట్టసభల్లో మహిళలకు 33% రిజర్వేషన్ కల్పించడానికి ఉద్దేశించిన 81వ రాజ్యాంగ సవరణ బిల్లును 1996 సెప్టెంబర్ 12న కేంద్రంలోని నాటి దేవెగౌడ ప్రభుత్వం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. కానీ ఈ బిల్లులోని అంశాలపై పలు పార్టీల ఎంపీలు అభ్యంతరాలు లేవనెత్తడంతో పరిశీలన కోసం గీతా ముఖర్జీ నేతృత్వంలోని సంయుక్త పార్లమెంటరీ కమిటీకి వెళ్లింది. కమిటీ నివేదిక వచ్చేలోపే ఆ లోక్‌సభ రద్దు కావడంతో బిల్లుకు కాలం చెల్లిపోయింది.

### 1998 :

మహిళా రిజర్వేషన్ బిల్లుకు 1998లో వాజ్‌పేయి ప్రభుత్వ హయాంలో రెండోసారి కదలిక వచ్చింది. వాజ్‌పేయి ప్రభుత్వం బిల్లును ప్రవేశపెట్టింది. అధికార, విపక్ష పార్టీల సభ్యుల అభ్యంతరాలతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. కొంతమంది ఎంపీలు బిల్లు ప్రతులను చింపేశారు. అధికార, విపక్షాల మధ్య బిల్లుపై ఏకాభిప్రాయం రాలేదు. అనంతరం ప్రభుత్వం పడిపోయింది. దీంతో మహిళా రిజర్వేషన్ బిల్లు గడువు తీరిపోయింది.



### 1999 :

వాజ్‌పేయి హయాంలో  పార్లమెంటు ముందుకు వచ్చిన మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రారంభ దశలోనే రివర్స్ కావడంతో రెండోసారి ఆయన ప్రభుత్వంలోనే 1999లో పార్లమెంటుకు చేరింది. సభ్యుల మధ్య తీవ్ర వ్యతిరేకత, గందరగోళం కారణంగా బిల్లుపై లోతుగా చర్చ జరిగినా ఓటింగ్‌లో వీగిపోయింది. ఆ తర్వాత కూడా మళ్లీ 2002, 2003 సంవత్సరాల్లో  బిల్లు సభ ముందుకు వచ్చినా.. మహిళా రిజర్వేషన్‌లోనే ఓబీసీ సబ్ కోటా (మహిళలకు) ఉండాలంటూ కొన్ని ప్రాంతీయ పార్టీలు పట్టుబట్టడంతో ఏకాభిప్రాయం కుదరలేదు.

### 2008:

మహిళా రిజర్వేషన్ బిల్లు నాలుగోసారి మన్మోహన్ సింగ్ ప్రభుత్వ హయాంలో 108వ రాజ్యాంగ సవరణ బిల్లు రూపంలో పార్లమెంటుకు చేరింది. అప్పటి కేంద్ర ప్రభుత్వం తొలుత రాజ్యసభలో ప్రవేశపెట్టింది. అప్పటికే పలుమార్లు బిల్లుకు కాలం తీరడంతో వ్యూహాత్మకంగా రాజ్యసభలో ప్రవేశపెట్టాలన్న ఆలోచన చేసింది. రాజ్యసభలో బిల్లు పెడితే అది రద్దు కాదనే భావనే ఇందుకు కారణం. కేంద్ర ప్రభుత్వం ఆశించినట్లుగానే 2010 మార్చి 9న రాజ్యసభలో బిల్లు భారీ మెజారిటీతో ఆమోదం పొందింది. ఆ బిల్లు లోక్‌సభకు చేరింది. కానీ పార్టీల మధ్య గొడవలు, వ్యతిరేకత వల్ల అప్పటి ప్రభుత్వం దీన్ని లోక్‌సభలో ప్రవేశపెట్టలేకపోయింది. ఈలోగా 2014లో లోక్‌సభ రద్దు కావడంతో రాజ్యసభ ఆమోదించినప్పటికీ బిల్లు వీగిపోయింది.





### 2023:

కేంద్రంలో మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం 2023 సెప్టెంబర్ 19న 128వ రాజ్యాంగ సవరణ రూపంలో మహిళా రిజర్వేషన్ అంశాన్ని నారీశక్తి వందన్ అధినియమ్ బిల్లు పేరుతో పార్లమెంటుకు చేరింది. లోక్‌సభలో 454 ఓట్లతో భారీ మెజారిటీతో బిల్లు ఆమోదం పొందింది. రాజ్యసభలోనూ 214 ఓట్ల మెజార్టీతో ఆమోదం పొందింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదముద్ర వేయడంతో చట్టంగా మారింది. ఆ ప్రకారం 2026 తర్వాత జరిగే జనగణన, ఆ తర్వాత జరిగే డీలిమిటేషన్ అనంతరం మహిళలకు 33% రిజర్వేషన్ అమల్లోకి రావాలి.

### 2026 :

చట్టరూపం దాల్చిన మహిళా రిజర్వేషన్‌ను 2034 లోక్‌సభ ఎన్నికల వరకూ ఆగకుండా 2029లోనే అమలు చేయాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం 2026 ఏప్రిల్ 16న లోక్‌సభలో సవరణ బిల్లును ప్రవేశపెట్టింది. డీలిమిటేషన్‌తో ముడిపెట్టి 131వ రాజ్యాంగ సవరణ బిల్లుగా తీసుకొచ్చింది. రెండు రోజుల సుదీర్ఘ చర్చలో కేంద్ర ప్రభుత్వంపై విపక్షాలు భగ్గుమన్నాయి. చిత్తశుద్ధి ఉంటే డీలిమిటేషన్‌తో ముడిపెట్టకుండా వెంటనే 33% రిజర్వేషన్ అమలయ్యేలా విడిగా బిల్లు పెట్టాలని డిమాండ్ చేశాయి. కానీ పెడచెవిన పెట్టడంతో ఏప్రిల్ 17న ఓటింగ్‌లో బిల్లు వీగిపోయింది.





# బీజేపీ చిత్తశుద్ధిపై అనుమానాలెన్నో..!

**మహిళా రిజర్వేషన్ బిల్లు విషయంలో బీజేపీ చిత్తశుద్ధిపైనే ఇప్పుడు అనుమానాలు నెలకొన్నాయి. లోక్‌సభలో మూడింట రెండొంతుల మెజారిటీ లేదని తెలిసినా రాజ్యాంగ సవరణ బిల్లు పెట్టడం వెనక ప్రతిపక్షాలను బ్లేమ్ చేయాలన్న కుట్ర దాగి ఉన్నదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బిల్లు ఆమోదం కష్టమేనని తెలిసినా బీజేపీ ఉద్దేశపూర్వకంగానే దీన్ని రాజకీయ అస్త్రంగా మల్చుకోడానికి ఈ డ్రామా నడిపించిందని విపక్షాలు ఇప్పటికే ఆరోపణలు చేశాయి. నిజంగా మహిళా రిజర్వేషన్ పట్ల బీజేపీకి చిత్తశుద్ధి ఉన్నట్లయితే డీలిమిటేషన్ బిల్లుతో ముడిపెట్టకుండా అమలు చేసే అవకాశమున్నదని వ్యాఖ్యానించాయి. డీలిమిటేషన్ బిల్లుతో లింకు చేయడంతోనే సమస్య మొదటికొచ్చిందని విమర్శించాయి. డీలిమిటేషన్ బిల్లును విపక్షాలు వ్యతిరేకిస్తున్నాయని తెలిసినా కేంద్రం మహిళా రిజర్వేషన్ బిల్లుతో లంకె పెట్టి నెపాన్ని విపక్షాల మీదకు నెడుతున్నదని ఆరోపించాయి.**

## ఈసారి మహిళా రిజర్వేషన్లు లేనట్లే!

రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడంతో మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు అర్ధంతరంగా ఆగిపోయింది. రాబోయే (2029) లోక్‌సభ ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్ అమలయ్యే అవకాశం లేదు. పార్లమెంటు 2023లో ఆమోదించిన మహిళా రిజర్వేషన్ చట్టం ప్రకారం 2026 తర్వాత జరిగే జనగణన, దానికి కొనసాగింపుగా డీలిమిటేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాతనే మహిళలకు రిజర్వేషన్ అమలవుతుందనే స్పష్టత ఉన్నది. కానీ ఇప్పుడు అటు జనగణన పూర్తికాలేదు, మరోవైపు డీలిమిటేషన్ సైతం పెండింగ్‌లోనే ఉన్నది. దీంతో మహిళా రిజర్వేషన్లు 2029 ఎన్నికల్లో అమల్లోకి వచ్చే అవకాశాలు కష్టం. ఒకవేళ జనగణన, డీలిమిటేషన్ అప్పటిలోగా పూర్తయితే 2023లో రూపొందిన మహిళా రిజర్వేషన్ చట్టం ప్రకారం లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో మహిళలకు 33% రిజర్వేషన్ అమలయ్యే అవకాశం ఉంటుంది. కానీ రెండున్నరేండ్ల వ్యవధిలో ఈ రెండూ పూర్తికావడం అనుమానంగా మారింది.


## సీట్లను పెంచకుండా కోటా సాధ్యం కాదా?

మహిళా రిజర్వేషన్ విషయంలో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య పరస్పర విరుద్ధమైన కామెంట్లు చోటుచేసుకున్నాయి. బీజేపీకి మహిళా రిజర్వేషన్ అమలు చేయాలన్న చిత్తశుద్ధే ఉన్నట్లయితే 2023లోనే స్పష్టత ఇచ్చి ఉండేదని ప్రియాంకాగాంధీ, రాహుల్‌గాంధీ సహా విపక్ష పార్టీల నేతలు చర్చల సందర్భంగా వ్యాఖ్యానించారు. ఇప్పటికైనా డీలిమిటేషన్‌తో సంబంధం లేకుండా మహిళా రిజర్వేషన్ బిల్లును విడిగా పెట్టి ఇప్పుడున్న 543 స్థానాల్లోనే మహిళలకు రిజర్వేషన్ ఎందుకు కల్పించడంలేదని ప్రశ్నించారు. డీలిమిటేషన్ బిల్లుతో మహిళా రిజర్వేషన్ బిల్లును డీలింక్ చేసి విడిగా పెడితే 543 స్థానాల్లోనే మహిళలకు 33% రిజర్వు చేయడానికి సిద్ధంగా ఉన్నామని, ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం చేయకుండా యధాతథంగా ఆమోదం తెలుపుతామని రాహుల్‌గాంధీ లోక్‌సభలోనే స్పష్టం చేశారు. బీజేపీ చిత్తశుద్ధిలోనే కుట్ర ఉన్నదని ఆరోపించారు.

## బీజేపీ బ్రహ్మాస్త్రం వికటించిందా?

తమిళనాడు, పశ్చిమబెంగాల్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే బీజేపీ మహిళా రిజర్వేషన్ బిల్లును తెరమీదికి తెచ్చిందని విపక్షాలు విమర్శిస్తున్నాయి. మహిళా రిజర్వేషన్ బిల్లును బీజేపీ ఒక రాజకీయ బ్రహ్మాస్త్రంగా వాడుకోవాలని చూసిందని, కానీ డీలిమిటేషన్ బిల్లు కారణంగా అసలుకే ఎసరొచ్చిందన్న విమర్శలు వచ్చాయి. కేవలం రాజకీయ లబ్ది పొందేందుకే మహిళా బిల్లును వాడుకోవాలని చూసిందని.. ఈ నెల 23, 29 తేదీల్లో తమిళనాడు, పశ్చిమబెంగాల్‌లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో అటు డీఎంకేపైనా, ఇటు తృణమూల్ కాంగ్రెస్‌పైనా విమర్శలు చేసి ఎక్కువ సీట్లు గెలిచే డ్రామాను కొత్తగా మొదలుపెట్టిందన్న కామెంట్లూ వినిపిస్తున్నాయి. డీఎంకే, తృణమూల్ కాంగ్రెస్ పార్టీలను మహిళా వ్యతిరేక పార్టీలంటూ ముద్రవేసి అక్కడ బీజేపీ కూటమి పార్టీల గెలుపు కోసం కొత్త లాజిక్‌ను తెరమీదకు తెచ్చే అవకాశాలనూ విపక్షాలు పసిగట్టాయి. రాజ్యాంగ సవరణ బిల్లు నెగ్గేందుకు అవసరమైన బలం లేకపోయినా, వీగిపోతుందని తెలిసినా మోదీ సర్కార్ ఇంత హడావిడిగా లోక్ సభలో పెట్టడం వెనుక ఎన్నికల స్టంట్ ఉందని దుయ్యబడుతున్నాయి. ఎన్ని కుట్రల చేసినా.. ఇష్టారీతిన డీలిమిటేషన్ చేయాలనుకునే మోదీ సర్కార్ ప్రయత్నాలను ముందుకు సాగనివ్వబోమని, డీలిమిటేషన్‌తో సౌత్‌కు అన్యాయం చేయాలని చూస్తే సహించబోమని ప్రతిపక్షాలు అంటున్నాయి. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, వాళ్లకు వాస్తవాలు తెలుసని చెప్తున్నాయి.

## 880 సీట్లతో కొత్త పార్లమెంటు కట్టినా..!



కొత్త పార్లమెంటు భవనాన్ని 880 సీట్ల సామర్థ్యంతో డిజైన్ చేసే సమయానికే బీజేపీకి డీలిమిటేషన్ ద్వారా సీట్ల సంఖ్య పెంచాలనే ఆలోచన ఉన్నదనేది బహిరంగ రహస్యం. డీలిమిటేషన్ ఎప్పుడు జరపాలనేది రాజ్యాంగంలో స్పష్టత ఉన్నప్పటికీ హడావిడిగా బిల్లును తీసుకొచ్చి హంగామా సృష్టించిందని, పకడ్బందీ ప్లాన్ ప్రకారం మొత్తం వ్యవహారాన్ని రక్తి కట్టించిందని విపక్షాలు ఫైర్ అయ్యాయి. ఆ ఆలోచనకు అనుగుణంగానే ఇప్పుడున్న సీట్లను ప్రొ-రేటా పద్ధతిలో 50% చొప్పున పెంచి మొత్తం సీట్ల సంఖ్యను 850 చేయాలనుకున్నది. ఇప్పుడున్న రాజకీయ పరిస్థితుల్లో సీట్ల సంఖ్యను పెంచితే తప్ప మరోసారి అధికారంలోకి రావడం కష్టమనే ప్లాన్‌తోనే ఈ డ్రామా నడిపించిందన్న ఆరోపణలూ వచ్చాయి. ఆగమేఘాల మీద సీట్ల సంఖ్యను పెంచి లబ్ధి పొందాలనుకున్న ప్రయత్నాలు బెడిసికొట్టాయని, బీజేపీ ఉద్దేశం బట్టబయలైందని, కొత్త భవనంలో యధావిధిగా 543 సీట్లతోనే పార్లమెంటు సమావేశాలు కొనసాగనున్నాయి.




## పొలిటికల్ గేమ్ కోసమే బిల్లుల డ్రామా ?

మహిళా రిజర్వేషన్ బిల్లుపై బీజేపీకి నిజంగా చిత్తశుద్ధి ఉన్నదా?.. ఉంటే సీట్ల సంఖ్యను పెంచే ప్రతిపాదనతో ఎందుకు లింకు పెట్టినట్లు?.. ఇప్పుడున్న సీట్లలోనే మహిళలకు 33% ఇవ్వడానికి ఎందుకు సిద్ధపడడం లేదు?.. ఇవన్నీ బీజేపీకి కాంగ్రెస్ సంధిస్తున్న ప్రశ్నలు. డీలిమిటేషన్ బిల్లుతో మహిళా రిజర్వేషన్ అంశాన్ని లింకు పెట్టడంతో ఈ సమస్యంతా వచ్చిందన్నది కాంగ్రెస్ వాదన. డీలిమిటేషన్ చేయడానికి రాజ్యాంగ సవరణ తప్పనిసరి కావడంతో ఆ సవరణ బిల్లును కూడా కేంద్రం పెట్టింది. కానీ సభలో మూడింట రెండొంతుల మెజారిటీ అవసరమని తెలిసినా, ఆ మేరకు సంఖ్యా బలం లేదని అర్థమైనా ఈ బిల్లును ఎందుకు పెట్టిందన్నది ఇప్పుడు హాట్ టాపిక్. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే బీజేపీ ఈ డ్రామా ఆడిందన్నది విపక్షాల ప్రధాన విమర్శ.

## బెంగాల్, తమిళనాడు ఎన్నికల కోసమేనా?

మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్ కల్పించాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తున్నా లోక్‌సభలో బిల్లును అడ్డుకుని విపక్షాలు మహిళా వ్యతిరేకులుగా నిలిచాయన్నది బీజేపీ వాదన. లోక్‌సభలో రాజ్యాంగ చట్ట సవరణ బిల్లు ఓడిపోవడంతో ఇప్పుడు పశ్చిమబెంగాల్, తమిళనాడులో ఈ నెల 23, 29 తేదీల్లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో పొలిటికల్ మైలేజ్ కోసం బీజేపీ గేమ్ ప్లాన్ చేస్తున్నది. మహిళల ఓట్లను ఆకర్షించడానికి మహిళా బిల్లు అంశాన్ని వినియోగించుకోవాలని భావిస్తున్నది. విపక్షాలకు నిజంగా మహిళా రిజర్వేషన్‌పై నిజాయితీ ఉంటే సహకరించి ఉండేవని, అవి మహిళా వ్యతిరేక స్వభావంతో కూడకుని ఉన్నందునే వ్యతిరేకించాయని, మహిళల నోటికాడ ముద్దని నేలపాలు చేశాయని విపక్షాలపై విమర్శలు మొదలుపెట్టింది. ఎలాగూ రాజ్యాంగ సవరణ బిల్లు ఓడిపోతుందని తెలిసినా కేవలం అసెంబ్లీ ఎన్నికల స్టంట్‌లో భాగంగానే ఈ కుట్రకు పాల్పడిందన్నది విపక్షాల వాదన.

# రూల్ 66 సస్పెండ్‌తో భారీ స్కెచ్!




లోక్‌సభలో చట్ట సవరణలు, కొత్త చట్టాలకు అవసరమైన బిల్లులు, శాసన వ్యవహారాలకు సంబంధించి నిర్దిష్టమైన రూల్స్ ఉన్నాయి. ఏ బిల్లు ఎప్పుడు పెట్టాలి?.. ఎలా పెట్టాలి?.. వీటికి స్పష్టమైన నిబంధనలే ఉన్నాయి. అయినా వాటిలోని లొసుగులను ప్రభుత్వాలు అడ్వాంటేజ్‌గా మల్చుకోవడం కామన్ అయిపోయింది. తాజాగా మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్, రాజ్యాంగ సవరణ బిల్లుల విషయంలో కేంద్ర ప్రభుత్వం ఆ తెలివినే ప్రదర్శించింది. రూల్ 66ను సస్పెండ్ చేసి ఈ బిల్లుల్ని ప్రవేశపెట్టింది.

ఏవైనా బిల్లులు ఒకదానిపై మరొకటి పూర్తిగా లేదా పాక్షికంగా ఆధారపడినప్పుడు లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వం వాటిని ప్రవేశపెడితే ఒక బిల్లుపై పూర్తి స్థాయిలో చర్చ జరిగి ఆమోదం పొంది, ఆ తర్వాత రాజ్యసభలోనూ ఆమోదం పొంది, రాష్ట్రపతి ఆమోదం కోసం వెళ్లి అప్రూవల్ అయ్యి ప్రభుత్వం గెజిట్ జారీ చేసిన తర్వాతనే రెండో బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టాలి. ఇది రూల్ 66 ఇచ్చే స్పష్టత. కానీ తాజా పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో మాత్రం లోక్‌సభ స్పీకర్ ఈ రూల్ 66ను సస్పెండ్ చేసి కార్యక్రమాలను మొదలుపెట్టారు. అంటే బిల్లులు ఒకదానిపై మరొకటి పూర్తిగా లేదా పాక్షికంగా ఆధారపడి ఉన్నవైతే వేర్వేరుగా కాకుండా ఒకే బిల్లు అనే తరహా స్ఫూర్తితో కలిపి టేబుల్ చేసింది ప్రభుత్వం. దీంతో మహిళా రిజర్వేషన్ బిల్లు, డీలిమిటేషన్ బిల్లు, రాజ్యాంగ సవరణ బిల్లులను కలిపి ఒకటిగానే ప్రవేశపెట్టింది. ఈ మూడింటిపై జమిలిగా చర్చలు జరిగాయి. వీటన్నింటికీ రాజ్యాంగ సవరణ కీలకం కావడంతో దానిపై ఓటింగ్ జరిగింది. ఓడిపోవడంతో మూడూ ఓడినట్లయింది. లాంఛనంగా మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ బిల్లులను ఉపసంహరించుకుంటున్నట్లు కేంద్రం ప్రకటించింది.

మూడింటికీ కలిపి మైలేజ్ పొందాలనుకున్న బీజేపీ ప్రభుత్వం రూల్ 66ను సస్పెన్షన్‌ను మాస్టర్ స్ట్రోక్‌గా భావించింది. కానీ ఒక్క దెబ్బకు మూడు పిట్టలు అన్న చందంగా రాజ్యాంగ సవరణను ఓడించడంతో మిగిలిన రెండింటికీ చెక్ పెట్టేలా వ్యవహరించాయి విపక్షాలు. మూడింట రెండొంతుల మెజారిటీ లేదని తెలిసినా బిల్లులకు ఆమోదం లభించినా లభించకపోయినా ఏదో ఒక రూపంలో పొలిటికల్ మైలేజ్ వస్తుందని బీజేపీ భావించింది. గెలిస్తే క్రెడిట్‌పైన ప్రచారం చేసుకునేది. ఓడినందుకు విపక్షాల కుట్ర అంటూ మండిపడుతున్నది.

# డీలిమిటేషన్ ప్లాన్‌కు బ్రేక్..
# సౌత్‌కు రిలీఫ్

**రాజ్యాంగ సవరణ బిల్లుకు లోక్‌సభలో చుక్కెదురు కావడంతో డీలిమిటేషన్ ప్రక్రియకు బ్రేకులు పడ్డాయి. అన్ని రాష్ట్రాల్లో ప్రో-రేటా ప్రకారం పెంచాలనుకున్న కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదన అర్ధంతరంగా ఆగిపోయింది. ఇప్పుడున్నట్లుగానే యధాతథంగా లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలు కొనసాగనున్నాయి. మళ్ళీ రాజ్యాంగ సవరణ చేసేంతవరకు లోక్‌సభ స్థానాల సంఖ్య పెరిగే అవకాశమే లేదు. ఇకపైన జరగబోయే లోక్‌సభ ఎన్నికలు యధావిధిగా 543 స్థానాలకే జరగనున్నాయి. ఇప్పుడున్న నియోజకవర్గాల సరిహద్దులు కూడా యధాతథంగా ఉండనున్నాయి. ప్రస్తుతం లోక్‌సభలో ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణ, డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లులకు సవరణలు, మార్పులు జరిగితేనే ఈ మూడూ సాకారమయ్యే అవకాశమున్నది. డీలిమిటేషన్‌తో నార్త్-సౌత్ వివక్ష వివాదం కూడా తాత్కాలికంగా సద్దుమణిగినట్లయింది.**

## సందేహాలన్నింటికీ ఫుల్‌స్టాప్

డీలిమిటేషన్ ప్రక్రియకు బ్రేక్ పడడంతో దక్షిణాది రాష్ట్రాల్లోని పలు ప్రాంతీయ పార్టీలకు ఇప్పటివరకూ ఉన్న సందేహాలు తొలగిపోయినట్లయింది. ఏ రాష్ట్రంలో ఎన్ని సీట్లు పెరుగుతాయో కేంద్ర హోంమంత్రి అమిత్ షా లెక్కలతో సహా చెప్పినప్పటికీ డీలిమిటేషన్ కమిషన్ ప్రక్రియలో నియోజకవర్గాల సరిహద్దులు, ఎస్సీ/ఎస్టీ రిజర్వేషన్ స్థానాలపై అనేక అనుమానాలు కొనసాగాయి. కానీ వీటన్నింటికీ ఇప్పుడు ఫుల్‌స్టాప్ పడినట్లయింది. డీలిమిటేషన్‌ను పాతికేండ్ల పాటు జరపకుండా సీలింగ్ పెట్టాలని స్టాలిన్, రేవంత్‌రెడ్డి తదితరులంతా కేంద్ర ప్రభుత్వాన్ని గట్టిగానే డిమాండ్ చేశారు. ఇప్పుడున్న సీట్లను పెంచొద్దని గతంలో ఇందిరాగాంధీ, వాజ్‌పేయి తీసుకున్న నిర్ణయం తరహాలోనే ఇప్పుడు కూడా తాత్కాలిక నిషేధం విధించాలని పట్టుబట్టారు. ఎట్టకేలకు వారు కోరుకున్నట్లుగానే రాజ్యాంగ సవరణ బిల్లుకు లోక్‌సభలో ఆమోదం రాకపోవడంతో డీలిమిటేషన్ ప్రక్రియ అటకెక్కినట్లయింది.

## కొత్త సెన్సస్ ఆధారంగానే డీలిమిటేషన్

ప్రస్తుతం రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడంతో డీలిమిటేషన్ బిల్లును కూడా కేంద్రం ఉపసంహరించుకోక తప్పలేదు. యధావిధిగా ప్రస్తుతం రాజ్యాంగంలో పేర్కొన్నట్లుగా 2026 తర్వాత జరిగే తొలి జనగణన నివేదిక అనంతరమే డీలిమిటేషన్ నిర్వహించాలన్న విధానం లైన్‌లోకి వచ్చినట్లయింది. ప్రస్తుతం మొదలైన 2027 డిజిటల్ జనగణన పూర్తయ్యి నివేదిక పార్లమెంటులో టేబుల్ అయిన తర్వాతనే డీలిమిటేషన్ ఆ లెక్కల ఆధారంగా జరగనున్నది. అయితే సీట్ల సంఖ్య పెరిగే విషయం కేంద్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయం, పార్లమెంటులో జరిగే చర్చల అనంతరం బిల్లుకు లభించే ఆమోదంమీద ఆధారపడి ఉంటుంది. సీట్లు పెరిగినా పెరగకపోయినా నియోజకవర్గాల సరిహద్దుల మార్పు, ఎస్సీ/ఎస్టీ రిజర్వేషన్ కేటాయింపుపై డీలిమిటేషన్ కమిషన్ తీసుకునే నిర్ణయానికి దక్షిణాది రాష్ట్రాల్లోని పార్టీల అభ్యంతరం ఉండకపోవచ్చు.

## అన్యాయానికి చెక్!

డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందంటూ వివిధ పార్టీలు ఆందోళన వ్యక్తం చేశాయి. తమిళనాడు సీఎం స్టాలిన్ పిలుపుతో ఆ రాష్ట్రమంతా ఇండ్లపై నల్లజెండాలు ఎగిరాయి. డీఎంకే ఎంపీలు నల్ల దుస్తులతో పార్లమెంటు సమావేశాలకు హాజరైన నిరసన తెలిపారు. డీలిమిటేషన్ బిల్లుతో దక్షిణాది రాష్ట్రాలకు శాశ్వత నష్టం, అన్యాయం జరుగుతుందన్న ఆందోళనతో బిల్లు కాపీలను తమిళనాడు సీఎం స్టాలిన్ తగులబెట్టారు. శాస్త్రీయ విధానానికి బదులుగా ప్రో-రేటా పద్ధతిలో సీట్లను పెంచడాన్ని దక్షిణాది రాష్ట్రాలు తప్పుపట్టాయి. కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదన ప్రకారమే డీలిమిటేషన్ జరిగి అన్ని రాష్ట్రాల్లో లోక్‌సభ స్థానాల సంఖ్య పెరిగితే దక్షిణాది రాష్ట్రాలతో సంబంధం లేకుండా మిగిలిన రాష్ట్రాల్లోని బలంతోనే కేంద్రంలో ప్రభుత్వం ఏర్పడే అవకాశముండేది. కానీ ఇప్పుడు లోక్‌సభలో రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడంతో దక్షిణాది రాష్ట్రాలకు భారీ ఉపశమనం లభించినట్లయింది.

